క్లుప్తంగా

విద్యా సరస్వతిని దర్శించుకున్న సునీతారెడ్డి



మనవడి అన్నప్రాసన కార్యక్రమంలో సునీతారెడ్డి

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రాన్ని సోమవారం మాజీ మంత్రి సునీతారెడ్డి సందర్శించారు. కుమారుడు శశిధర్‌రెడ్డి–రుత్వికరెడ్డి దంపతులు, మనవడు నిష్వికారెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. మనవడికి అమ్మవారి సన్నిధిలో శాస్త్రోక్తంగా అన్నప్రాసన జరిపించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దొంగతనాలకు అడ్డుకట్ట

ఏసీపీ సదానందం



పాఠశాలలో ఏసీపీ విచారణ

మద్దూరు(హుస్నాబాద్): కొన్ని రోజులుగా ఉమ్మడి మండలంలో జరుగుతున్న దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏసీపీ సదానందం చెప్పారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం విచారణ జరిపారు. దసరా సెలువుదినాలలో తొమ్మిది ల్యాప్‌ట్యాప్‌లు, మూడు కంప్యూటర్లు చోరీ జరిగిన విషయం తెలిసిందే. అదేవిధంగా చోరీకి గురైన వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దొంగతనాలను అరికట్టేందుకు నిఘా పెంచుతామన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని చెప్పారు. ఆయన వెంట చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ షేక్ మహబూబ్ ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పరామర్శించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(లక్ష్మాపూర్) మాజీ సర్పంచ్ కొలిచెల్మె స్వామి తండ్రి మల్లయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న యాదవరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, కొండపాక మాజీ ఎంపీపీ ర్యాగల దుర్గయ్య సోమవారం మాజీ సర్పంచ్ స్వామిని పరామర్శించారు. కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, నిమ్మ రమేశ్, ప్రవీణ్, నిజామొద్దిన్ తదితరులున్నారు.

నర్సింహాచార్యకు దసరా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నర్సింహాచార్య

దుబ్బాక: దుబ్బాకకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ జ్యోతిష్యపండితుడు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగువిశ్వ విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నర్సింహాచార్య దసరా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారంతోపాటు జ్యోతిష్య ప్రవీణ, బహుముఖ ప్రజ్ఞాశాలి బిరుదులు ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పూర్వ రిజిస్ట్రార్ త్రిమూర్తుల గౌరీశంకర్, వీరబ్రహ్మేంద్రస్వామి ముదిమనువలు వీరబొట్లయ్యస్వామి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

ఉద్యోగ భద్రత కరువు



నినాదాలు చేస్తున్న వర్కర్లు

హుస్నాబాద్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాలోతు సత్యం నాయక్ వాపోయారు. స్థానిక గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఎదుట వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మెకు సోమవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, టైం స్కేల్ ప్రకారం జీతాలు ఇవ్వాలని కోరారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

గుట్టుగా.. గుట్టలు స్వాహా!

యథేచ్ఛగా మట్టి దందా

- మాయమవుతున్న మెరుపుగుట్ట, ధారగుట్ట
- అడ్డుకుంటున్నా ఆగని తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



మట్టి తవ్వకాలు జరుపుతున్న గుట్ట

సిద్దిపేటఅర్బన్: మట్టి దందాతో గుట్టలు మాయమవుతున్నాయి. అక్రమార్కుల ధనదాహానికి తోడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుట్టలు గుట్టుగా కరిగిపోతున్నాయి. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకొని వాటిని కాపాడాలని గ్రామస్తులు ఎంత మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా నెలల తరబడి అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తవ్వకాల కారణంగా అర్బన్ మండలం మిట్టపల్లి శివారులోని మెరుపుగుట్ట, ధారగుట్టలు అనవాళ్లు కోల్పోయాయి. ఇంకా కొన్ని రోజులు ఇలాగే ఊరుకుంటే గుట్టలు మొత్తం మింగేస్తారని, ఆ తర్వాత భూమిని కూడా కబ్జా చేస్తారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రివేళల్లో తవ్వకాలు

గ్రామ శివారులోని మెరుపుగుట్ట, ధారగుట్ట నుంచి రాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో గ్రామానికి చెందిన కొంత మంది యువకులు వెళ్లి పలుమార్లు అడ్డుకున్నారు. అలా అడ్డుకున్నప్పుడు జేసీబీలు, టిప్పర్లను అక్కడి నుంచి తీసుకుపోయినా.. మళ్లీ కొన్ని రోజులకు యథాతథంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇలా ఎన్నిసార్లు అడ్డుకున్నా సమయం రాత్రివేళల్లో తవ్వకాలు జరుపుతూ గుట్టలను మాయం చేస్తున్నారని యువకులు వాపోతున్నారు. గుట్టపై ఉన్న పురాతన నరసింహస్వామి దేవాలయాన్ని సైతం ధ్వంసం చేసి మరీ మట్టి తవ్వకాలు జరిపారని చెప్తున్నారు.

కరిగిపోతున్న గుట్టలు



మట్టిని టిప్పర్‌లో నింపుతూ..

అక్రమ మట్టిదందా కారణంగా మిట్టపల్లిలోని గుట్టలు కరిగిపోతున్నాయి. దాదాపు 50 మీటర్ల ఎత్తుతో వందల ఎకరాల్లోని గుట్టలు నేడు భూమట్టానికి వచ్చాయి. ఇది ఇలాగే కొనసాగితే వందల ఎకరాల భూమి అక్రమార్కుల చేతిలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. మొద్దు నిద్ర పోతున్న అధికారులు ఇప్పటికైనా మట్టి తవ్వకాలను ఆపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తవ్వకాలను అడ్డుకుంటే దాడులు

అక్రమంగా మట్టిని తవ్వుతూ గుట్టలను మాయం చేస్తున్నారని కొంత మంది యువకులతో కలిసి పలుమార్లు తవ్వకాలను అడ్డుకున్నాం. అక్రమ దందాకు అడ్డు వస్తున్నానని కిరాయి మనుషులను రాత్రి సమయంలో మా ఇంటిపైకి దాడికి పంపించారు. గ్రామ సంపదను దోచుకున్న వారిపై అధికారులు చర్యలు తీసుకొని గుట్టలను కాపాడాలి.

– రాజుపేట రంజిత్, మిట్టపల్లి

గుట్టలను కాపాడండి

మా ఊరి సంపదైన మెరుపుగుట్ట, ధారగుట్టలను పూర్తిగా నేలమట్టం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. గుట్టలతోపాటు గుడిని కూల్చి మట్టి తవ్వకాలు జరిపిన వారిని శిక్షించాలి. గ్రామ సంపదను కొల్లగొట్టే వారికి సహకరించే వారికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతాం.

– గోవిందారపు మహేందర్, మిట్టపల్లి

మనిషి దశదిశ మార్చేది చదువే..

వన్‌టౌన్ ఎస్ఐ జమాలుద్దిన్



విద్యార్థులతో ఎస్ఐ జమాలుద్దిన్, ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చదువు ఒక్కటే మనిషి దశదిశ మారుస్తుందని వన్‌టౌన్ ఎస్ఐ జమాలుద్దిన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, షీ టీం విధులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అపరిచితుల మాటలు నమ్మవద్దన్నారు. మహిళల భద్రత కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. చదువుకునే సమయంలో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు బానిసలుగా మారొద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం గీతాదేవి, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తం

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఎస్ఐ మల్లారెడ్డి సూచించారు. పట్టణంలోని విశ్వతేజ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే డయల్ 100, షీ టీమ్ 8712667434, మహిళా పోలీస్‌స్టేషన్ 8712667435 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

సుడిదోమ నివారణకు సస్యరక్షణ

ఏఈఓ నాగార్జున



వరి దుబ్బులను పరిశీలిస్తున్న ఏఈఓ నాగార్జున

తొగుట(దుబ్బాక): వరిలో సుడిదోమ నివారించేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ నాగార్జున సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలో వరి సాగును సోమవారం ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సుడిదోమలు వరి దుబ్బుల మొదళ్లను ఆశించి నష్టపరుస్తాయన్నారు. వాటివల్ల మొక్కలు గిడసబారి పోషకాలు అందక పసుపురంగులో మారి సుడులు సుడులుగా ఎండిపోతాయని తెలిపారు. వాటి ఉధృతి అధికంగా ఉన్నప్పుడు వరికంకి వరకు ఆశించి పంటను తీవ్రంగా నష్టపరుస్తామన్నారు. ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ మాసాల్లో సుడిదోమ ఉధృతి పెరిగే అవకాశముందని చెప్పారు. సుడిదోమను నివారించేందుకు పొలంలో పాయలు తీసుకోవాలని, బుప్రోఫిన్ 1.6మిలీ, లేదా ఎసిఫేట్ 1.5గ్రా, లేదా ఇథోఫెన్ ప్రాక్స్ 2.0మిలీ, లేదా ఇమిడాక్లోప్రిడ్, ఎథిప్రోల్ 0.25గ్రా లేదా ట్రీఫ్లూమేజాపైరి 0.5మిలీ లేదా పైమెట్రోజిన్ 0.5గ్రా డైనోటేఫ్యురాన్ 0.4గా ఒక లీటరు నీటిని కలుపుకుని స్ప్రే చేసుకోవాలని సూచించారు. పాయలు తీసుకున్న మొక్కల మొదళ్ల భాగంలో మందు పడేలా స్ప్రే చేసుకోవాలని చెప్పారు.

కుక్కల వీర విహారం

- చిన్నారులపై దాడులు
- బెంబేలెత్తుతున్న స్థానికులు



కట్కూర్‌లో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కుక్కలు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పలు రహదారులు, వార్డుల్లో గుంపులుగా తిరుగుతూ చిన్నారులపై విరుచుకు పడుతున్నాయి. విద్యార్థులను పాఠశాలకు పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. రాత్రి వేళ ఒంటరిగా బయటకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఒకప్పుడు గ్రామాల్లో కుక్కలను పట్టుకొనేవారు. కొంతకాలంగా జంతు సంరక్షణ చట్టం ఆదేశాలతో ఈ చర్యలకు బ్రేక్ పడింది. ఇప్పుడు పట్టుకొని టీకాలు వేసి వదిలేస్తున్నారు. దీంతో కుక్కలు విపరీతంగా పెరిగిపోయి ప్రజల్ని భయకంపితుల్ని చేస్తున్నాయి. కొన్ని నెలలుగా సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు విన్నవించినా కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

కేంద్రానికి కొమ్ముకాస్తున్న ఎన్నికల కమిషన్

కాంగ్రెస్ పార్టీ నాయకులు



సంతకాల సేకరణ పత్రాలను చూపుతున్న కాంగ్రెస్ నేతలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో 43వ వార్డు ఇన్‌చార్జిలు, కౌన్సిలర్‌లకు ఓటు చోరీపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతివార్డు నుంచి 100 మందితో సంతకాల సేకరణ, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకొనే హక్కు రాజ్యాంగం కల్పిస్తే ప్రధాని మోదీ మాత్రం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. ఓటు చోరీ వల్లే కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. ఓటు చోరీతోనే తెలంగాణలో బీజేపీ ఎనిమిది సీట్లు గెలిచిందని అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలంతా కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఓటు చోరీ ఎలా జరిగిందో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ వివరించినా ఎన్నికల సంఘం వివరణ ఇవ్వలేదని వాపోయారు. ఈ నెల 15లోగా సంతకాల సేకరణ పూర్తిచేసి అధిష్టానానికి స్వయంగా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హరికృష్ణ, అత్తు ఇమామ్, ముద్దం లక్ష్మి, మార్క సతీశ్ గౌడ్, దాసా అంజయ్య, వహీద్ ఖాన్, కలిమొద్దిన్, చాంద్ మియా, మార్క పద్మ, గయాజొద్దిన్, వహాబ్, హర్షద్, బాబా, అజ్మత్, కావేరి, పద్మారెడ్డి, భవాని, రజని, సన తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విశాల సహకార పరపతి సంఘం సీఈఓ తిరుమల

హుస్నాబాద్: రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విశాల సహకార పరపతి సంఘం సీఈఓ తిరుమల కోరారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం గ్రేడ్ ఏ రకం రూ.2,389, సాధారణ రకం క్వింటాలుకు రూ.2,369 కనీస మద్దతు ధర కల్పించనున్నట్లు తెలిపారు. ధాన్యం 17 శాతం తేమ ఉండేలా చూసుకోవాలని సూచించారు. సన్న ధాన్యానికి ప్రతి క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్ గంగారాం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సీపీకి ఘన వీడ్కోలు



అనురాధకు జ్ఞాపికను అందజేస్తున్న పోలీసు అధికారులు

సిద్దిపేటకమాన్: బదిలీపై వెళ్తున్న సీపీ అనురాధను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది సోమవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి సన్మానించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ సిద్దిపేటలో పనిచేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. దౌల్తాబాద్ మండలం ముత్యంపేటకు చెందిన బాలుడు రాకేశ్‌కు కుడిచేతి లేని విషయం తెలుసుకుని సీపీ సంబంధిత వైద్యులతో మాట్లాడి ఆర్టిఫిషియల్ చేతిని అమర్చేందుకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం



చిన్నకోడూరులో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

దేవీ శరన్నవరాత్రులను ముగించుకుని సోమవారం చిన్నకోడూరులో దుర్గాదేవి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళల నృత్యాలు, కోలాటాల మధ్య అమ్మవారిని ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో మహిళలు, యువతులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దుర్గామాత ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

రాజును ఆదర్శంగా తీసుకోవాలి

ముదిరాజు సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్



రాజును సన్మానిస్తున్న ముదిరాజు సంఘం నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పేదరికాన్ని జయించి గౌరవ ప్రదమైన ఉద్యోగాన్ని సాధించిన చామంతుల రాజును ముదిరాజులు ఆదర్శంగా తీసుకోవాలని ముదిరాజు సంఘం రాష్ట్ర కార్యదర్శి జంగిటి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ సచివాలయంలో ఆర్థికశాఖ సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించిన చిన్నకోడూరుకు చెందిన రాజును సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిన రాజు చిన్నతనంలోనే తండ్రి మృతి చెందగా తల్లి, కొడుకులు కూలీ పనులు చేస్తూ జీవనం సాగించారన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ప్రాధాన్యం కల్పించండి



పనులు పరిశీలిస్తున్న ముదిరాజ్ నాయకులు

గజ్వేల్‌రూరల్: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలోని పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలలో అధికంగా ఉండే ముదిరాజ్‌లు చైతన్యవంతులై రాజకీయంగా రాణించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ముదిరాజ్‌లకు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, కిష్టయ్య, భిక్షపతి, వెంకటయ్య, మల్లేశం, కనకయ్య పాల్గొన్నారు.

గిరిజన ఆత్మీయ సమ్మేళనం రేపు

పలుతండాల్లో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్‌లో 8న తలపెట్టిన లంబాడీల(గిరిజన) ఆత్మీయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని గిరిజన సంఘాల రాష్ట్ర నేతలు మాలోతు భీలునాయక్, కిషన్‌నాయక్, గుగులోతు తిరుపతి నాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గిరిజనతండాల్లో ఛలో హుస్నాబాద్ వాల్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని జరుగుతున్న కుట్రను తిప్పికొట్టేందుకు తండాల నుంచి వేలాది మంది గిరిజనులు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో గిరిజన నేతలు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న టీచర్లు

పార్ట్‌టైమ్ టీచర్స్ అసోసియేషన్ నేత రాజు

మిరుదొడ్డి(దుబ్బాక): ఉద్యోగ భద్రతతోపాటు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని పార్ట్‌టైమ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం రాజు డిమాండ్ చేశారు. మండలంలోని అల్వాల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల–కళాశాల ఎదుట భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల నుంచి పార్ట్‌టైం ఉద్యోగులకు వేతనాలు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆ కుటుంబాలు సతమతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీధర్, కనకరాజు, అశోక్, సత్యం, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రిక్వెస్ట్ బస్‌స్టాప్ కోసం నిరసన



రోడ్డుపై నిరసన తెలియజేస్తున్న కాలనీ వాసులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని శ్రీరామ్‌నగర్, మొండి చింత కాలనీల వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసులు ప్రధాన రహదారిపై సోమవారం నిరసనకు దిగారు. వారికి మద్దతుగా సీపీఎం మండల కార్యదర్శి బండకింది అరుణ్ మాట్లాడుతూ కాలనీల్లో దాదాపు 80 ఇళ్లు ఉన్నాయని, కానీ అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. కాలనీలో వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రధాన రహదారిపై బస్సులు ఆపకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి శ్రీరామ్‌నగర్, మొండిచింత కాలనీల ఎదురుగా రిక్వెస్ట్ బస్‌స్టాపులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లేశం, భాస్కర్, రాంప్రసాద్, కాలనీ వాసులు చందర్, భిక్షపతి, పరమేశ్వర్, లచ్చవ్వ, వెంకటలక్ష్మి, అనిల్, మల్లయ్య, భారతి, పద్మ, కిష్టవ్వ, అనురాధ, మమత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న హిందీ అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సతీశ్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మంగళవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగ విరమణ సభ

గజ్వేల్: గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆ పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ ప్రభాకర్ ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ వై.కృష్ణతోపాటు టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్, టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ శ్రీనివాస్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రం హాజరై ప్రసంగించారు.